నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 12 జూలై 2024 | KARIMNAGAR

# ప్రజాసేవే పరమావధి

- ఇది కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అభిమతం
- ఎక్కడ ఉన్నా ప్రజలతో మమేకం
- ఓవైపు వైద్యం, మరోవైపు సమస్యల పరిష్కారం



వృద్ధురాలి ఆరోగ్య రిపోర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, జూలై 11, (నమస్తే తెలంగాణ): వృత్తి రీత్యా వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణుడైన సంజయ్ కల్వకుంట్ల, ప్రజాసేవపై మక్కువతో ప్రజాజీవితంలోకి అడుగుపెట్టారు. ఉచిత వైద్య శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన ఆయన, మొదటి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నుంచి విజయం అందుకున్నారు. గెలుపుతో ఒక మెట్టుపైకి ఎదిగినా.. తాను మాత్రం మరింత అందుబాటులో ఉంటున్నారు. ఇంటి వద్ద ఉన్నా.. పర్యటనలో ఉన్నా.. ఎక్కడ ఉన్నా తక్షణమే స్పందిస్తున్నారు. తన వద్దకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక ఎమ్మెల్యేగానే కాదు, ఒక వైద్యుడిగా అనారోగ్య బాధితులకు భరోసా ఇస్తున్నారు. రెండు రోజుల క్రితం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పరిశీలించగా.. ఆయన ప్రజాసేవలో లీనమై కనిపించారు. ఉదయం 8.45 గంటలకే ప్రజలు ఎమ్మెల్యే ఇంటికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హాల్‌లో ముందు మూడు వరుసల్లో జనం కూర్చున్నారు. మూడో వరుసలో 25మంది పాతికమంది వరకు కూర్చొని ఉన్నారు. 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హాల్‌లోకి వచ్చారు. ఆయన వస్తూనే మూడో వరుసలో కూర్చున్న వారి వద్దకు వచ్చి మాట్లాడారు. వారంతా అనారోగ్య సమస్యలతో వచ్చినట్టు గుర్తించారు. ఇబ్రహీంపట్నం మండ లం తిమ్మాపూర్‌కు చెందిన బోడ రాజు వెన్నునొప్పితో బాధపడుతున్నానని చెప్పగా, ఆమె రిపోర్టులు, ఎక్స్‌రేలు పరిశీలించి మందులు రాసిచ్చారు. అలాగే, మెట్‌పల్లికి చెందిన షేక్ సల్మాన్ రెండు మోకాళ్లకు గాయాలయ్యాయని చెప్పగా, రిపోర్టు పరిశీలించారు. గాంధీ దవాఖానలో ఉన్న ఆర్థోపెడిక్ సర్జన్‌తో మాట్లాడి సల్మాన్‌కు శస్త్ర చికిత్స చేయాలని విన్నవించారు. తర్వాత జగిత్యాలకు చెందిన బొల్లారపు లక్ష్మయ్య ఫ్రోజోన్ షోల్డర్ సమస్యతో రాగా, చేతిని పరీక్షించారు. శస్త్రచికిత్స చేయించుకోవాలని, యశోదలో ఉన్న తన స్నేహితుడైన డాక్టర్ నితిన్ వద్దకు వెళ్లాలని సూచించారు. ఆ వెంటనే నితిన్‌తో ఫోన్‌లో మాట్లాడి, లక్ష్మయ్యకు ఆపరేషన్ అవసరమని, ఫీజులో 50 శాతం వరకు రాయితీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇలా మొత్తం 25 మందిని ఓపికగా పరీక్షించి, మందులు రాసి ఇచ్చి, వారి సమస్యలకు పరిష్కారం చూపారు. తర్వాత మిగిలిన ప్రజలతో సాధారణ సమస్యలపై చర్చించారు. సైబర్ మోసంపై మహిళ రాగా.. సీఐ తో ఫోన్లో మాట్లాడి న్యాయం చేయాలని సూచించారు. అలాగే, మురుగు కాలువ విషయమై వచ్చిన గ్రామస్తులందరినీ సముదాయించి సమస్య పరిష్కారంపై చర్చించారు. కొడుకు, కోడలిని కోల్పోయానని, ఇద్దరు మనుమలకు దారి చూపాలని అడిగిన వృద్ధురాలికి సహాయం చేయడంతోపాటు మనుమల చదువు కోసం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌తో చర్చించారు. ఇలా ఎమ్మెల్యే దాదాపు 2 గంటలపాటు సమయం కేటాయించి, పరిష్కారం కోసం అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా, ఒక వైపు వైద్యం, మరో వైపు ప్రజా సమస్యల పరిష్కారంతో రెండు విధాలుగా ప్రజల కోసం తపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రజల మన్నన పొందాలంటే సంజయ్ సారే నిదర్శనమని కొనియాడుతున్నారు.

### ప్రజలకు ఉపయోగపడుదాం

నాకు ప్రజాసంక్షేమం, అభివృద్ధి ముఖ్యం. నేను బేసిక్‌గా వైద్యుడిని. ప్రజాప్రతినిధిగా సేవ చేసే అదృష్టం భగవంతుడు కల్పించాడు. వైద్యసేవ చేసే అవకాశం తల్లిదండ్రులు కల్పించారు. ఎంత వీలైతే అంత ఎక్కువ ప్రజలకు ఉపయోగపడుదాం. సేవ చేద్దాం. ప్రజాసేవ చేయాలంటే అధికార పార్టీలో ఉండాలన్న రూలేం లేదు. మనసులో సంకల్పం ఉండాలే గానీ ఎక్కడ ఉన్నా ప్రజలకు సేవ చేయచ్చు.

- డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల ఎమ్మెల్యే

# మెట్‌పల్లి సీడీపీవోపై వేటు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు సరెండర్

మెట్‌పల్లి, జూలై 11: ఐసీడీఎస్ (స్త్రీ, శిశు సంక్షేమ శాఖ) మెట్‌పల్లి సీడీపీవోపై వేటు పడింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మెట్‌పల్లి ప్రాజెక్ట్ అధికారిగా తిరుమలదేవి 2016 జనవరిలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి తనకున్న పలుకుబడితో బదిలీ అనేది దరిచేరనీయకుండా జాగ్రత్త పడుతూ ఇక్కడే కొనసాగుతూ వచ్చారు. ఈ క్రమంలోనే అనేక విమర్శలున్నాయి. ఇటీవల ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణకు వినియోగించే అద్దె కారు బిల్లుల చెల్లింపులో అవినీతికి పాల్పడడం, పలువురి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నుంచి డబ్బులు వసూలు చేయడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం ఇలా అనేక ఆరోపణలతో కూడిన ఫిర్యాదులు కలెక్టర్‌కు వెళ్లాయి. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించగా, జిల్లా సంక్షేమ అధికారి మే 15న విచారణ జరిపారు. ఆరోపణలు నిజమని తేలినట్టు తెలుస్తుండగా.. ఆ నివేదికను కలెక్టర్‌కు సమర్పించడంతో సీడీపీవోపై చర్యలు తీసుకున్నారు. ఆమెను స్త్రీ,శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు సరెండర్ చేస్తూ, ఆమె స్థానంలో ఏసీడీపీవో మనెమ్మకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆర్డర్స్ తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. కాగా, సరెండర్ ఉత్తర్వులను ఈ నెల 10న సీడీపీవో కార్యాలయానికి చేరగా, ఆమె తీసుకునేందుకు నిరాకరించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయంలోని నోటీసు బోర్డుకు సిబ్బంది అతికించారు.

## అబార్షన్ల రాకెట్‌లో

# ఆ ఇద్దరు మహిళా డాక్టర్లే కీలకం!



**కాసుల కక్కుర్తితో ఆడ శిశువులను కడుపులోనే కాలరాస్తున్న వైద్యులు**

- మంచి కోసం వాడాల్సిన డ్రగ్స్ గర్భ విచ్ఛిత్తి కోసం వినియోగం
- తల్లిదండ్రులను ఒప్పించాల్సింది పోయి దందాకు ప్రోత్సాహం
- ఇప్పటికే దారుణంగా పడిపోతున్న ఆడపిల్లల నిష్పత్తి
- కూపీ లాగితే డొంకంతా కదిలే అవకాశం
- కఠిన చర్యలు తీసుకుంటేనే భ్రూణహత్యలకు అడ్డుకట్ట

జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా సాగుతున్న భ్రూణహత్యల రాకెట్ సంచలనం రేపుతున్నది. రోజుకో కొత్త విషయం వెలుగు చూస్తున్నది. అబార్షన్లు చేయడంలో ఓ ఇద్దరు మహిళా డాక్టర్లే కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. వీరు హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ దవాఖానల్లోనే పనిచేస్తున్నట్టు సమాచారం ఉండగా.. సదరు వైద్యులు ఏయేటికాయేడు దందాను పోటీపడి మరీ పెంచుతున్నారు. కాసుల కక్కుర్తితో రోజుకు నాలుగైదు అబార్షన్లు చేస్తూ.. ఏకంగా ఎనిమిది నెలల శిశువులను సైతం గర్భంలోనే చిదిమేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే భ్రూణహత్యలను అడ్డుకోవాల్సిన ఆ మహిళా డాక్టర్లు.. 'ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువు' అన్న నానుడిని అక్షరాలా నిజం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు, అవసరాలను బట్టి.. ఒక్కో అబార్షన్‌కు ఒక్కో రేటు కట్టి అందినకాడికి దండుకొని రూ.కోట్లకు పడగలెత్తుతున్నా వారిలో ఇంకా ధనదాహం ఆశలు పెరుగుతున్నాయి. స్వార్థ ప్రయోజనాల కోసం ఎందరినో బలిపశువులను చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆడపిల్లల నిష్పత్తి దారుణంగా పడిపోతున్న నేపథ్యంలో ఈ తరహా ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే.. మున్ముందు మరింత ప్రమాదం పొంచి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్ జూలై 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా సాగుతున్న భ్రూణహత్యల రాకెట్‌లో రోజుకో కొత్త కోణం వెలుగు చూస్తున్నది. ఈ దందా మూడు రాష్ట్రాలకు విస్తరించగా.. అబార్షన్లు చేయడంలో ఓ ఇద్దరు డాక్టర్లే కీలక భూమిక పోషిస్తున్నారు. సదరు వైద్యులు కొన్నేళ్లుగా ఈ దందాను నడుపుతున్నారు. వీరు హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ దవాఖానాల్లోనే పనిచేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. అందులో ఒకరు అబార్షన్లు చేయడంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తూ ఇప్పటికే కోట్లకు పడగలెత్తగా.. మరో వైద్యురాలు ఆమెను చూసి కొన్నాళ్ల నుంచి పోటీ పడుతున్నట్టు తెలుస్తున్నది. నిజానికి శిశువు గర్భంలో చనిపోయినప్పుడు, విచ్ఛిత్తి చేసి.. రక్తస్రావం అయ్యేలా చేసేందుకు కొన్ని డ్రగ్స్ ఉన్నాయి. తల్లి ప్రాణానికి ముప్పు ఉందని భావించే తరుణంలో ఈ డ్రగ్స్‌ను వినియోగిస్తారని కరీంనగర్ జిలాకేంద్రానికి చెందిన ఓ ప్రముఖ గైనకాలజిస్ట్ తెలిపారు. అయితే, ఈ డ్రగ్స్‌ను అబార్షన్ల కోసం యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వీటితోపాటు గర్భవిచ్ఛిత్తి తర్వాత నొప్పులు వంటివి రాకుండా సులువుగా రక్తస్రావం కావడానికి ఒక రకమైన లిక్విడ్‌ను వినియోగిస్తున్నట్టు హుస్నాబాద్ పోలీసుల నిఘాలో వెలుగు చూసింది. ఇది అత్యంత ప్రాణాంతకమని తెలుస్తున్నది. ఇలా సాగుతున్న అబార్షన్ల దందాలో సదరు మహిళా డాక్టర్లే కీలకంగా వ్యవహరిస్తున్నట్టు చాలా మందికి తెలిసినా.. ఆ దిశగా నిఘా యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు. ముఖ్యంగా వైద్యారోగ్యశాఖ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో సదరు వైద్యురాళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అబార్షన్ కేసులను తీసుకొచ్చేందుకు ఏకంగా ఓ నెట్‌వర్క్‌నే మెయింటెన్ చేస్తున్నారంటే వాళ్ల వ్యవహారం ఎంతదూరం వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, రోజురోజుకూ తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తున్నట్టు తెలిసింది. వివిధ సమస్యలతో ప్రభుత్వ దవాఖానలకు వచ్చే వారిని గుర్తించి, వారికి తప్పుడు మాటలు చెప్పి అబార్షన్లు చేసి.. డబ్బులు దండిగా గుంజుతున్నట్టు తెలుస్తున్నది. నిజానికి గర్భంలో ఆడపిల్ల అని తెలిసి ఎవరైనా అబార్షన్ కోసం వస్తే నచ్చజెప్పి, అవసరమైతే ఆమె తల్లిదండ్రులు, భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి, అబార్షన్ చేసుకోకుండా అడ్డుపడి ప్రాణం పోయాల్సిన సదరు డాక్టర్లే.. గర్భంలో ఆడపిల్ల ఉందని చెప్పి ఇష్టానుసారం అబార్షన్లు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా పర్యవేక్షణాలోపం వల్లే జరుగుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పడిపోతున్న బాలికల సంఖ్య

ఉమ్మడి జిల్లాలో తాజా గణాంకాల ప్రకారం చూస్తే 0-6 ఏళ్ల వయసున్న బాల బాలికలు 3,36,053 మంది కాగా, అందులో 1,73,647 మంది బాలురు, 1,62,406 మంది బాలికలు ఉన్నారు. బాలికలకన్నా.. బాలురు 11,241 మంది ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ ప్రతి వెయ్యి మంది బాలురకు 935 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. అలాగే 3,36,053 మంది బాలబాలికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 2,44,443 మంది ఉండగా.. అందులో బాలురు 1,26,222 మంది, బాలికలు 1,18,221 మంది ఉన్నారు. అంటే ప్రతి వెయ్యి మంది బాలురకు 936 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. అలాగే, అర్బన్ ప్రాంతాల్లో మొత్తం 91,610 మంది ఉండగా.. అందులో 47,425 మంది బాలురు, 44,185 మంది బాలికలున్నారు. ఇక్కడ ప్రతి వెయ్యి మంది బాలురకు 932 మంది బాలికలున్నారు. ఇక కరీంనగరంలోకి వస్తే 0-6 వయసున్న చిన్నారుల సంఖ్య 29,560 ఉండగా, అందులో బాలురు 15,238 మంది, బాలికలు 14,322 మంది ఉన్నారు. ఇక్కడ ప్రతి వెయ్యి మందికి 939 మంది బాలికలున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో పరిస్థితి దారుణంగా ఉన్నది. ఇక్కడ మొత్తం 19,037 మంది బాలబాలికలుండగా, అందులో 10,031 మంది బాలురు, 9,006 మంది బాలికలున్నారు. ఇక్కడ ప్రతి వెయ్యి మంది బాలురకు 897 మంది బాలికలే ఉన్నారు. ఇదే పరిస్థితి చాలా ప్రాంతాల్లో ఉన్నది. నిజానికి ఏయేటికాయేడు భ్రూణహత్యలు పెరిగిపోతున్నాయి. పుట్టేది ఆడబిడ్డ అని తెలియగానే.. గర్భంలోనే నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. దీనికి కాసులకు కక్కుర్తిపడే కొంత మంది వైద్యులు సహకరిస్తున్నారు. ఫలితంగా స్త్రీ జాతి తన అస్తిత్వాన్ని కోల్పోయే పరిస్థితి తెచ్చిపెడుతున్నది. ఈ పరిస్థితుల్లో అబార్షన్ల పేరిట ఆడశిశులను చిదిమేసేందుకు సహకరిస్తున్న వైద్యులు, దవాఖాన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ దందాకు అడ్డుకట్టపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కార్యనిర్వహణ అధికారి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## కోడెల కోసం నిరసన

వేములవాడ, జూలై 11: వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించిన కోడెలను రైతులకు ఉచితంగా అందజేస్తుండగా గురువారం తమకు అందలేదని సుమారు 100 మంది రైతులు కార్యనిర్వహణ అధికారి కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. రాజన్న ఆలయానికి భక్తుల సమర్పించిన దాదాపు 1500 కోడెలను ఈ నెల 3 నుంచి రైతులకు పంపిణీని ప్రారంభించారు. అయితే, ముందుగా ఆలయ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా సుమారు 2500 వచ్చాయి. దీంతో అర్హులను గుర్తించి ఆరు రోజులపాటు పంపిణీని కొనసాగించారు. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడం, ప్రస్తుతానికి కోడెల పంపిణీ ముగిసినందున మరో నోటిఫికేషన్ జారీ చేస్తామని ఏఈవో నవీన్ వెల్లడించారు. నిరసన తెలుపుతున్న రైతుల వద్దకు చేరుకొని వారిని సముదాయించారు. వారి వివరాలను ఆలయ సిబ్బంది ద్వారా సేకరించి తదుపరి సమాచారం ఇస్తామని వివరించారు.

## ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 11 : విదేశాల్లో చదివే జిల్లాలోని క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం-2024 కింద ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాను ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనెడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణకొరియా వంటి దేశాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ చదివే విద్యార్థులు ఈ పథకం ద్వారా ఉపకార వేతనం పొందేందుకు అర్హులని, గరిష్టంగా రూ.20 లక్షల ఉపకారవేతనంతోపాటు ఫ్లైట్ టికెట్ రూ.60 వేలకు మించకుండా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రూ.5 లక్షలకు ఆదాయ పరిమితి మించకుండా ఉన్న కుటుంబాలకు చెంది, ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 31 మధ్యకాలంలో విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలు, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ఆగస్టు 7 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులకు సంబంధించిన హార్డుకాపీలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

# సర్వర్ డౌన్

**మూడు గంటలకే ఆఫీసులు క్లోజ్**

- అంతటా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలు
- ఉదయం 11 నుంచి 3 గంటల దాకా ఎదురుచూపులు
- కార్యాలయాల వద్ద పడిగాపులు
- చేసేదేమీ లేక వెనుదిరిగిన క్రయ, విక్రయదారులు



కరీంనగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

కరీంనగర్ కలెక్టరేట్/ తిమ్మాపూర్/ గంగాధర, జూలై 11 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో మరోసారి సర్వర్‌డౌన్ అయింది. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. స్లాట్ బుక్ చేసుకున్న కొనుగోలుదారులు తమపేర పట్టా చేసుకునేందుకు విక్రయదారులతో కలిసి రాగా, సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో క్రయ, విక్రయదారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా వేచి చూడాల్సి వచ్చింది. సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందా..? అధికారులు ఎప్పుడు తమ పేర్లు పిలుస్తారా..? అని స్లాట్ బుక్ చేసుకున్న వారంతా కార్యాలయాల నుంచి కదలకుండా ఉండిపోయారు. మధ్యాహ్న భోజనం సైతం చేయకుండా వేచి చూశారు. కార్యాలయ పనివేళలు ఇంకా కొద్దిసేపే ఉండగా, ఇక సర్వర్ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి లేక నిరాశతో వెనుదిరిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య తలెత్తగా, దీనిని పరిష్కరించడంలో హైదరాబాద్ స్థాయిలో ఇబ్బందులు ఎదురైనట్టు జిల్లా అధికారులు పేర్కొన్నారు. సర్వర్‌లో నెలకొన్న సాంకేతిక ఇబ్బందులతో ఈకేవైసీ ఆధార్ లింకప్ కాకపోవడం, క్రయ, విక్రయదారులు, సాక్షుల ఫొటోలు కంప్యూటర్‌లో నిక్షిప్తమయ్యే అవకాశాలు లేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్టు తెలిపారు. కాగా, తరచుగా జరుగుతున్న అంతరాయంతో రిజిస్ట్రేషన్‌దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని క్రయ, విక్రయదారులు ఆవేదన చెందారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి సమస్య ఎదురైతే, గంటల వ్యవధిలోనే సరిచేసి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించేవారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు.

- ♦ కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిత్యం 50కి పైగానే రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. నగరంలోని వివిధ కాలనీల్లో భూములు, భవనాలు, ఇతర స్థిరాస్థులు కొనుగోలు చేసిన వారికోసం,కలెక్టరేట్ వెనుక భాగంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. గురువారం సేవలు నిలిచిపోవడంతో క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు.
- ♦ తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈకేవైసీ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఉదయం 11.15 గంటల వరకు పనిచేసిన సర్వర్ అకస్మాత్తుగా పనిచేయకపోవడంతో సేవాదారులు సాయంత్రం వరకు వేచి చూసి తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌ను వివరణ కోరగా సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని చెప్పారు.
- ♦ గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ రిజిస్ట్రేషన్ సేవలు నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈకేవైసీ సమస్యతో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం వరకు కూడా పరిష్కారం రాకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగారు. సుదూర ప్రాంతాలను నుంచి వచ్చామని, రోజంతా వృథా అయిందని ఆవేదన చెందారు. కాగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్టు పుకార్లు రావడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు ఒకింత ఆందోళనకు గురయ్యారు.
- ♦ జగిత్యాల జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. క్రయవిక్రయదారులకు సంబంధించిన ఆధార్ బయోమెట్రిక్ తీసుకునే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో బయోమెట్రిక్ విధానం పనిచేయలేదు. జగిత్యాల, మెట్‌పెల్లి, కోరుట్ల, మల్యాలలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్లకు వచ్చిన క్రయవిక్రయదారులు బయోమెట్రిక్ ఎప్పుడు పనిచేస్తుందా..? అంటూ సాయంత్రం వరకు నిరీక్షించారు.

### తహసీల్ ఆఫీసుల్లోనూ అదే దుస్థితి

మానకొండూర్, జూలై 11 : మరోవైపు తహసీల్ ఆఫీసుల్లోనూ సర్వర్ డౌన్ కావడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. స్లాట్ బుక్ చేసుకొని వచ్చిన తర్వాత తీరా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పొద్దంతా పడిగాపులుగాశారు. బుధవారం ఎండ దంచి కొట్టగా ఇబ్బంది పడ్డారు. మానకొండూర్‌లోని తహసీల్దార్ అండ్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సాయంత్రం వరకు దాదాపు 6 గంటల వరకు చెట్ల కింద చేదతీరారు. సర్వర్‌లో సమస్య తలెత్తడంతోనే రిజిస్ట్రేషన్లు కావడం లేదని అధికారులు తెలియజేశారు.



మానకొండూర్ తహసీల్ ఆఫీసులో రైతులు



కరీంనగర్ డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట బైఠాయించిన చేగుర్తి గ్రామ మహిళలు

# మాకు న్యాయం చేయండి

- స్త్రీనిధి సొమ్ము స్వాహా ఉదంతంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- చేగుర్తి మహిళల ఆందోళన
- డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట బైఠాయింపు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 11 : గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది నిర్వాకంతో తాము మోసపోయామని, అధికారులు న్యాయం చేయాలని 40 మందికిపైగా కరీంనగర్ రూరల్ మండల చేగుర్తి గ్రామ మహిళలు వేడుకున్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట మూడు గంటలపాటు బైఠాయించి ఆందోళన చేశారు. కార్యాలయంలోకి రాకపోకలను అడ్డుకున్నారు. స్త్రీనిధి సొమ్ము స్వాహా ఉదంతంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ₹30 లక్షల కుంభకోణాన్ని తమపైకి నెట్టి డీఆర్‌డీఏ సిబ్బంది చేతులు దులుపుకున్నారని, దీంతో స్త్రీనిధి అధికారులు తమ ఇండ్లకు వస్తున్నారని ఆవేదన చెందారు. పది రోజుల క్రితం కూడా తాము డీఆర్‌డీవోను కలిసి తమ గోడు వెళ్లబోస్తే, వారంలో సమస్య పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారని, పదిరోజులు గడుస్తున్నా పరిష్కారం కాలేదని, డీఆర్‌డీవో వచ్చేదాకా కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. అధికారుల నిర్లక్ష్యమే వేధింపులకు కారణమని, నిధులు స్వాహా చేసిన గ్రామ వీవోతో లిఖిత పూర్వక పత్రం రాయించుకున్నా, తమను వేధింపులకు గురిచేయడం వెనుక అధికారుల పాత్ర ఉందని ఆరోపిస్తూ పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. నిత్యం కూలీ పనులకు వెళ్తేనే తమ కుటుంబం గడిచే పరిస్థితులు ఉండగా, సమస్య పరిష్కరించాలంటూ పదిహేను రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వరి నాట్ల సీజన్‌లో తాము రోజూ కూలి ₹300 కోల్పోతున్నామని, అధికారులు తమకు న్యాయం చేయాలని లేనిపక్షంలో మూకుమ్మడిగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కరీంనగర్ మండల ఏపీఎంను మహిళలు చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. దీంతో, ఆయన 'ఉన్నతాధికారి వద్ద కెళ్లి మీ సమస్య చెప్పుకోండి. నా చేతుల్లో ఏమి లేదు' అని తేల్చిచెప్పారు. ప్రధాన ద్వారం ఎదుట సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు బైఠాయించి ఆందోళన చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రాంనగర్, జూలై 11 : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష పడింది. ఇటీవల తాగి వాహనాలు నడిపి కరీంనగర్‌లో పట్టుబడిన 23 మంది వ్యక్తులను ట్రాఫిక్ పోలీసులు గురువారం కోర్టులో హాజరు పరిచారు. అందులో ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.7,000 జరిమానా, మిగతా 20 మందికి రూ.35,500 జరిమానా విధించారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 197 మందికి జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లాఖాన్ తెలిపారు.